సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ


ఆదివారం | 18 | ఫిబ్రవరి | 2024



స్వామి ఊరేగె.. మది ఉప్పొంగె

అంతర్వేది దివ్యక్షేత్రంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనృసింహ స్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.


8లో



లక్ష్మీప్రదం.. నారసింహుని ఆలయం

కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు గ్రామంలో కోట్లాది రూపాయల విలువైన అభివృద్ధి పనులకు చినజీయర్ స్వామి శ్రీకారం చుట్టనున్నారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,400, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,200 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10 అడుగులుగా నమోదైంది.

మద్యాంతర నిఘా

- ఎన్నికలు సమీపిస్తున్న వేళ అక్రమ మద్యానికి కట్టడి
- ఇతర రాష్ట్రాలు, యానాం నుంచి తరలిరాకుండా చర్యలు
- అన్ని వైపులా చెక్‌పోస్టులు
- సారా తయారు చేసే లంక గ్రామాలపై కన్ను
- గత డిసెంబర్ నుంచి పెరుగుతున్న కేసులు



తాళ్లరేవు మండలం సుంకరపాలెం వద్ద వాహనాల తనిఖీ

సాక్షి అమలాపురం: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అక్రమ మద్యం రవాణా... గోదావరి లంక గ్రామాల చాటుమాటున జరిగే నాటుసారా తయారీపై జిల్లా యంత్రాంగం పటిష్టమైన నిఘా పెట్టింది. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసులు, సేల్స్‌టాక్స్ అధికారులతో సంయుక్త బృందాలను ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లాతో రవాణా అనుబంధం ఉన్న పుదుచ్చేరి యానాం నుంచి అక్రమ మద్యం రాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టింది.

రంగంలోకి ప్రత్యేక బృందాలు

ఎన్నికలలో ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రాకుండా కట్టడి చేయడంతోపాటు సారాను అరికట్టేందుకు జిల్లా అధికారులు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా గత డిసెంబరు 2వ తేదీ నుంచి నిఘాను మరింత పెంచారు. పోలీసులతోపాటు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, సేల్స్ ట్యాక్స్ శాఖలకు చెందిన అధికారులతో బృందాలను ఏర్పాటు చేశారు. ఆయా బృందాలు అక్రమ మద్యం వచ్చే దారులపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. ముఖ్యంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల సరిహద్దు ఉన్న పుదుచ్చేరి యానాం నుంచి అక్రమ మద్యం అధికంగా వస్తుందని గుర్తించిన జిల్లా యంత్రాంగం చెక్‌పోస్టుల వద్ద సిబ్బందిని పెంచింది. జిల్లాలో ఓ వైపు 216 రహదారిలో ఎదుర్లంక, కాకినాడ జిల్లా వైపు 216 రహదారిపై తాళ్లరేవు మండలం సుంకరపాలెం, యానాం నుంచి రాజమహేంద్రవరం వెళ్లేచోట మల్లవరం పాటు రామచంద్రపురం రోడ్డులో ఇంజరం వద్ద చెక్ పోస్టులు ఉన్నాయి. వీటితోపాటు యానాం నుంచి కాకినాడ జిల్లాకు వెళ్లే పలు చిన్నచిన్న రహదారులపై సైతం నిఘా పెంచారు. జాతీయ రహదారి మీదనే కాకుండా మద్యం రవాణా జరిగే ప్రాంతాలపై నిఘాకు మొబైల్ బృందాలను ఏర్పాటు చేశారు. యానాం నుంచి బయటకు వచ్చే ప్రతి వాహనాన్ని పక్కాగా చెక్ చేసిగాని వదలడం లేదు. రహదారులపై ఆకస్మిక తనిఖీలు పెంచారు. పోలీసు స్టేషన్ల పరిధిలోనే కాకుండా, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్లు ఉన్న ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, రామచంద్రపురం, ఆలమూరు, కొత్తపేట పరిధిలో కూడా బృందాలు పనిచేస్తున్నాయి. బెల్ట్‌షాపుల ద్వారా జరుగుతున్న అమ్మకాల పై కూడా దాడులు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్ మద్యం కట్ట డి కోసం నిర్వహిస్తున్న నిరంతర సమీక్షలు కూడా దాడుల సంఖ్య పెరగడానికి కారణమవుతున్నాయి.



పట్టుబడుతున్న అక్రమ మద్యం.. సారా

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసుల నిఘా పెరిగిన తరువాత అక్రమ మద్యం, నాటుసారా పెద్ద మొత్తంలో పట్టుబడింది. ముఖ్యంగా యానాం నుంచి వస్తున్న మద్యం అధికంగా పట్టుబడుతోంది. డిసెంబర్ 24వ తేదీ నుంచి ఇప్పటి వరకు 198 కేసులు నమోదు చేసి 207 మందిని అరెస్టు చేశారు. ఇప్పటి వరకు 434 లీటర్ల మద్యం, 305 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాపుల ద్వారా అమ్మకాలు చేస్తున్న వారిపై కూడా దాడులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 167 కేసులు నమోదు చేశారు. వీరి వద్ద నుంచి 389 లీటర్ల ఐఎంఎల్ మద్యం, 23 లీటర్ల బీరు స్వాధీనం చేసుకున్నారు. ఐడీ కేస్ (సారా)కు సంబంధించి 56 కేసులు నమోదు చేసి 50 మందిని అరెస్టు చేశామని జిల్లా అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జి.అమర్‌బాబు 'సాక్షి'కి తెలిపారు.



ఐ.పోలవరం మండలం ఎదుర్లంకలో చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సిబ్బంది

లంక గ్రామాల్లో జల్లెడ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాటుసారా తయారీని అరికట్టేందుకు తీసుకున్న చర్యలు ఇప్పుడు ఫలితానిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 74 గ్రామాలలో నాటు సారా తయారీ గ్రామాలను గుర్తించారు. ఈ గ్రామాలలో విస్తృతంగా దాడులు చేయడం, పీడీ చట్టం కింద కేసుల నమోదు, నాటు సారాకి వ్యతిరేకంగా అవగాహన సదస్సులు నిర్వహించి 65 గ్రామాలను నాటు సారా రహితంగా తీర్చిదిద్దారు. తయారీదారుల కుటుంబాలలో మొదటి విడతగా 29 మందికి స్వయం సహాయక సంఘాల ద్వారా, స్త్రీ నిధి, ఉన్నతి పథకాల ద్వారా టిఫిన్ సెంటర్లు, పాడి పశువులు పెంచుకోవడం, వడ్రంగి పని, ఫిషింగ్, కూరగాయల మార్కెట్లు, సెంట్రింగ్ పని, కిరాణా షాపులు పెట్టుకోవడానికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.29 లక్షలు అందించారు. పరివర్తన్ 2.0లో భాగంగా తీసుకున్న ఈ నిర్ణయంతో మరిన్ని కుటుంబాలు సారా తయారీకి దూరమవుతున్నాయి. అయినా ఎందుకైనా మంచిదనే ఉద్దేశంతో కొత్తపేట, ఆత్రేయపురం, ఆలమూరు వంటి లంక గ్రామాలు, ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి, కాకినాడ జిల్లా తాళ్లరేవు వంటి సముద్రతీర మండలాల్లో మడ అడవుల ప్రాంతాల్లో నిఘా పెంచారు. ఇవి మంచి ఫలితాలను ఇస్తున్నాయి.

న్యూస్‌రీల్

చూసిన కనులదే భాగ్యం

దేదీప్యంగా అప్పనపల్లి బాలాజీ స్వామి



అప్పనపల్లిలో బాల బాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: ఆ స్వామివారి దివ్య స్వరూపం .. చూసిన కనులదే భాగ్యం.. పవిత్ర మాఘ మాసం శనివారం కావడంతో అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం భక్తులతో శోభిల్లింది. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన ఆ స్వామిని దర్శించుకుని ప్రతి హృదయం ఉప్పొంగింది. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి తమ కోర్కెలు నెరవేరాలని స్వామివారిని వేడుకున్నారు. ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయంలో శ్రీలక్ష్మీనారాయణ హోమంతో పాటు స్వామివారి నిత్య కల్యాణం వైభవంగా జరిగాయి. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.1.58 లక్షల ఆదాయం సమకూరింది. టిక్కెట్లు, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1.14 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.44,090 విరాళాలుగా వచ్చాయి. 2,863 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 2,095 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ ఏర్పాట్లను ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్, కొమ్ముల సూరిబాబు పర్యవేక్షించారు.

అంతర్వేదిలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ మల్లికార్జునరావుకు చిత్రపటం ఇస్తున్న అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం ఏపీ హైకోర్టు జస్టిస్ టి.మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా పూజలు చేశారు. తొలుత ఆయనకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాసకిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు ఎస్‌బీఎం రమేష్ స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

- అంతర్వేది తీర్థ మహోత్సవాల్లో భక్తులకు విక్రయించేందుకు ప్రాథమికంగా 2.25 లక్షల లడ్డూ ప్రసాదం తయారు చేయిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. 80 గ్రాముల లడ్డూ ప్రసాదం ఒక్కటి రూ.15 అన్నారు. భక్తులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు 1.30 లక్షల వాటర్ ప్యాకెట్లు సిద్ధం చేశామన్నారు.

పోక్సో కేసులో ఇద్దరికి జైలు శిక్ష

అమలాపురం టౌన్: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన పోక్సో కేసుకు సంబంధించి ఇద్దరికి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ కాకినాడ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు తీర్పు చెప్పారు. అప్పటి చింతూరు డీఎస్పీ, ప్రస్తుత కోనసీమ జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఈ కేసును దర్యాప్తు చేశారు. చింతూరు మండలం కుమ్మూరు పంచాయతీ శివారు కోయ మామిళ్లగూడెంలో నమోదైన పోక్సో కేసులో నిందితులు మిడియం రమేష్, ముచ్చిక లక్ష్మణరావుల నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ఓ బాలికపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేశారన్న అభియోగంపై నిందితులిద్దరికీ ఈ శిక్ష పడింది.

అనుమతులు లేని కార్యక్రమానికి వెళ్లొద్దు

ఎస్పీ సుసరావు శ్రీధర్



అమలాపురం టౌన్: ఉద్యోగులు ఈ నెల 18న విజయవాడలో చేపట్టిన 'ఓట్ ఫర్ ఓపీఎస్' కార్యక్రమానికి కమిషనర్ ఆఫ్ పోలీస్ నుంచి అనుమతులు లేవని జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ కార్యక్రమానికి జిల్లా నుంచి ఉద్యోగులు వెళ్లి ఇబ్బందులు పడవద్దని ఎస్పీ సూచించారు. పై పెచ్చు జిల్లాతో పాటు విజయవాడ పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉండటంతో అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో అసాంఘిక శక్తులు చేరి శాంతి, భద్రతలకు విఘాతం కలిగిస్తాయని అన్నారు. ఈ విషయాన్ని ఉద్యోగులు గమనించి విజయవాడకు వెళ్లవద్దని సూచించారు.

కోనేటిరాయా.. కోటిదండాలయ్యా

- కిక్కిరిసిన వాడపల్లి క్షేత్రం
- ఒక్క రోజే రూ.34.29 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: శ్రీవారి క్షేత్రం.. భక్తజన సందోహంలా మారింది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో క్షేత్రం కిక్కిరిసింది. ఉదయం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అర్చకులు అలంకరించారు. ఏడు వారాల నోము ఆచరిస్తున్న, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న స్వామివారి క్షేత్ర పాలకుడు శ్రీఅన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి వారికి పూజలు చేశారు. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ మాట్లాడుతూ స్వామివారి ప్రత్యేక దర్శనం, అన్న ప్రసాదాల విరాళం, సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ సేవల ద్వారా సుమారు రూ.34,29,664 ఆదాయం సమకూరిందన్నారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరుడు



వెంకన్న ఆలయం వద్ద భక్తజన సందోహం

జాతీయ స్థాయికి తొండవరం పాఠశాల ప్రాజెక్ట్



కోకోనట్ క్యాయర్ కార్బన్ డై ఆక్సైడ్ ఫిల్టర్ ప్రాజెక్టుతో తొండవరం విద్యార్థులు

అంబాజీపేట: వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి కోకోనట్ క్యాయర్ కార్బన్ డై ఆక్సైడ్ ఫిల్టర్ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైందని తొండవరం హైస్కూల్ హెచ్ఎం పీవీ కేశవాచార్యులు తెలిపారు. జాతీయ స్థాయిలో గౌరవ మినిస్ట్రీస్ ఆఫ్ ఎడ్యుకేషన్, బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జైపూర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐపీ ఇన్నోవేషన్ కాంటెస్ట్‌లో ఈ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్కూల్ తరపున 2023–24 సంవత్సరానికి ఇది అర్హత సాధించిందన్నారు. పాఠశాల సామాన్య శాస్త్ర ఉపాధ్యాయుడు కె.గణేష్ నరసింహారావు మార్గదర్శ ఉపాధ్యాయుడిగా (మెంటార్) వ్యవహరించగా, విద్యార్థులు ఎస్.శ్రీరామ్, ఎం.నమిత, ఎం.పార్వతి రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని హెచ్ఎం తెలిపారు. వీరిని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, అంబాజీపేట ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, ఎంపీటీసీ సభ్యుడు వాకపల్లి దొరబాబు, పీఎంసీ చైర్మన్ బొంతు భాస్కరరావు అభినందించారు.

నేటి నుంచి కుంతీమాధవ స్వామి కల్యాణోత్సవాలు

పిఠాపురం: పిఠాపురంలో శ్రీకుంతీ మాధవ స్వామివారి కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. తొలి రోజున ఆలయంలో ధ్వజారోహణ చేసి, రాజారావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ గోత్రనామాలతో పూజలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని ఈఓ ఎస్.శ్రీరాములు తెలిపారు. కల్యాణోత్సవాల సందర్భంగా గ్రామోత్సవాల నిర్వహణకు ఉపయోగించే స్వామి వారి వాహనాలను శుద్ధి చేశారు. 25 వరకూ కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు.

పాలనకు మూలస్తంభాలు వలంటీర్లు

- మంత్రి పినిపే విశ్వరూప్
- నగదు పురస్కారాల ప్రదానం



బండారులంకకు చెందిన వలంటీర్ పిల్లి పుష్పలతకు సేవా వజ్ర అవార్డు అందిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: పరిపాలనకు మూలస్తంభాలుగా ఉన్న వలంటీర్ల సేవలు నిస్వార్థమైనవని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శనివారం నడిపూడిలోని బాబూ జగ్జీవన్‌రామ్ కల్యాణ మండంలో రూరల్ మండలం పరిధిలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని అన్నారు. తద్వారా సంక్షేమ ఫలాల లబ్ధిని అర్హుల ఇంటికే చేర్చుతున్నారన్నారు. కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సేవలను అందించడమే లక్ష్యంగా వలంటీర్లు పనిచేస్తున్నారని అన్నారు. నిస్వార్థ సేవలకు ప్రతి రూపంగా వీరు పని చేస్తున్నారన్నారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వ సేవలను పటిష్టంగా అమలు చేస్తున్న వలంటీర్ల సేవలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏటా పురస్కారాలు అందిస్తుందన్నారు. మండలంలో ఒకరికి సేవా వజ్ర కింద రూ.45 వేలు, ఐదుగురికి సేవా రత్న కింద రూ.30 వేల చొప్పున నగదుతో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందించి ఘనంగా సత్కరించారు. మిగిలిన వారికి సేవా మిత్ర కింద రూ.15 వేల చొప్పున అందించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రాంగోపాల్, వైస్ ఎంపీపీ పి.బాలకృష్ణ, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కామిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి జాన గణేష్ పాల్గొన్నారు.

పక్కా కార్యాచరణతో సాగునీటి సరఫరా

- ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు
- ప్రభుత్వ సూచనలతో సమృద్ధిగా నీరు



వాడపాలెం లాకుల వద్ద విలేకరులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు

కొత్తపేట: పక్కా కార్యాచరణతో ప్రస్తుత రబీ వరి పంటకు అవసరమైన సాగునీరు అందిస్తున్నామని, ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఎక్కడా ఇబ్బంది రాలేదని ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని సెంట్రల్ డెల్టా కాలువల ద్వారా సాగునీటి సరఫరా, లాకుల వద్ద నీటిమట్టం, వంతుల వారీ విధానం పరిశీలనలో భాగంగా శనివారం ఆయన కొత్తపేట మండలం పలివెల, వాడపాలెం లాకులను, వాడపాలెం లాకుపై చానల్స్‌ను పరిశీలించారు. సాగునీరు సక్రమంగా సరఫరా చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి స్థానిక అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్ఈ విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో 8.96 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది రబీ అనంతరం సెంట్రల్ డెల్టాలో తొమ్మిది చోట్ల సుమారు రూ.2 కోట్లతో లాకులు ఆధునీకరణతో పాటు ఏటిగట్ల వద్ద షట్టర్లు ఏర్పాటు చేశామన్నారు. దానితో సాగునీరు వృథా కాకుండా చానల్స్ ద్వారా అవసరమైన నీరు పారుతుందన్నారు. ఉప్పలగుప్తం పరిసర ప్రాంతాల్లో సుమారు రూ 3 కోట్లతో డ్రైన్లలో పూడిక తీయించామన్నారు. తద్వారా పంటలకు ముంపు సమస్య తప్పిందన్నారు. గోదావరిలో గత ఏడాది కంటే ఈ ఏడాది వాటర్ లెవెల్ ఎక్కువగానే ఉందన్నారు. గత ఏడాది ఈ రోజుల్లో సెంట్రల్ డెల్టా 3 కాలువలకు 1,300 క్యూసెక్కులు నీరు విడుదల చేయగా, ఇప్పుడు 1,700 క్యూసెక్కుల చొప్పున విడుదల చేసినట్లు వివరించారు. ఇదే విధంగా నీరు సరఫరా చేస్తామన్నారు. దీనివల్ల సాగునీటి సమస్య రాదని స్పష్టం చేశారు. చానల్స్ శివారులో ప్రతి ఎకరానికి సాగునీటి సరఫరాకు ఏ విధమైన ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ ఏడాది ముక్కామల లాకును రూ.10 లక్షలు, వాడపాలెం లాకును రూ.5 లక్షలు, మసకపల్లి లాకును రూ.5 లక్షలతో ఆధునీకరణ, వాడపాలెం న్యూ చానల్ పూడికతీతకు రూ.5 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. సమావేశంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, వాడపాలెం రైతు సంఘ అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, కొత్తపేట ఎస్ఓ వి.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- వైభవంగా అంతర్వేది ఉత్సవాలు
- గరుడ, పుష్పక వాహనాలపై ఉత్సవమూర్తులకు ఊరేగింపు

స్వామి ఊరేగె.. మది ఉప్పొంగె

సఖినేటిపల్లి: నారసింహాయా నమో నమామి.. సదా స్మరామి అంటూ ప్రతి మదీ తన్మయత్వం చెందింది.. మనసారా స్మరించింది.. అంతర్వేదిలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహ స్వామివారి దివ్య తిరు కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు శనివారం సాయంత్రం గరుడ పుష్పక వాహనంపై, రాత్రి పుష్పక వాహనంపై స్వామి వారికి గ్రామోత్సవాలు అట్టహాసంగా జరిగాయి. వేదమూర్తయిన గరుడు స్వామివారి వాహనం. నిత్యం తనను సేవించే గరుడ వాహనంపై అధిరోహించి స్వామి గ్రామోత్సవానికి తరలివెళ్లారు. అలాగే తన హృదయమనే పుష్పకంలో ఎంతమంది భక్తులు వచ్చినా చోటు కల్పిస్తానని చాటేందుకు స్వామి పుష్పక వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకలు ఆలయ అర్చకుల పర్యవేక్షణలో జరిగాయి. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామ గోపాలరాజా బహద్దూర్, ప్రజాప్రతినిధులు, సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వామి ఆలయం.. తేజోమయం

లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద విద్యుద్దీపాల అలంకరణ ఆధ్యాత్మికత మరింత ఇనుమడింజేస్తుంది. ఇక్కడ ఏర్పాటు చేసిన దేవతామూర్తుల ఫ్లెక్సీలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ప్రధానంగా అయోధ్య రాముడి ఫ్లెక్సీతో పాటు పశ్చిమ రాజగోపురం, ప్రధాన, ఉపాలయాల గోపురాలు విద్యుత్ కాంతులతో శోభిల్లుతున్నాయి. పశ్చిమ రాజగోపురం నుంచి స్వామివారి దర్శనానికి వెళ్లే మార్గంలో షామియానాలతో ఏర్పాటు చేసిన కళాకృతులు ముచ్చట గొలుపుతున్నాయి. అలాగే ఆలయం లోపల క్యూలైన్లపై వేసిన షామియానాలు కూడా అందమైన డిజైన్లతో అలరిస్తున్నాయి.


అంతర్వేదిలో పుష్పక వాహనంపై నరసింహ స్వామివారికి గ్రామోత్సవం

అంతర్వేదిలో నేడు

ఈ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవ, 5.30 నుంచి 7 గంటల వరకూ తిరువారాధన, బాలభోగం, అర్చిత అభిషేకం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు ఉంటాయి. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ శ్రీసుదర్శన హోమం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు హంస వాహనంపై, 6.30 గంటలకు ధూపసేవ అనంతరం ధ్వజారోహణ జరుగుతుంది. రాత్రి 8 గంటలకు శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు.


విద్యుత్ దీపాలంకరణతో వెలుగులు జిమ్ముతున్న ప్రధాన, ఉపాలయాలు


పశ్చిమ రాజగోపురం వద్ద ఆలయం లోపల వైపు ఆకట్టుకుంటున్న అలంకరణ

లక్ష్మీప్రదం.. నారసింహుని ఆలయం

- దేవస్థానం అభివృద్ధికి నేడు శంకుస్థాపనలు
- త్రిదండి చినజీయర్ స్వామీజీచే అంకురార్పణ
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సారథ్యంతో పనులు

మధురపూడి: కోరుకొండ ఆధ్యాత్మికతకు నిలయం. ఆ లక్ష్మీనరసింహస్వామి కొలువైన ప్రాంతం.. స్వామివారి దేవస్థానానికి పూర్వ వైభవం తీసుకురావాలనేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అభిమతం.. అందుకే పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోంది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఎన్నికల హామీలో భాగంగా ఆలయ అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. దేవస్థానానికి మరింత శోభ తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. దేవస్థానంలో ఐదంతస్తుల రాజగోపురం, స్వామివారి ప్రధాన ఆలయానికి మెట్ల పైనుంచి భక్తులు సులభంగా చేరుకోవడానికి వీలుగా మెట్ల మార్గం నిర్మించనున్నారు. అలాగే దేవుని కోనేరును రూ.50 లక్షల రుడా నిధులతో అభివృద్ధి చేయనున్నారు. దీని చుట్టూ కూర్చుని తెప్పోత్సవాన్ని వీక్షించేలా 100 మీటర్ల పొడవున గ్యాలరీ, చుట్టూ మెట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సమీపంలోని అగ్రహారంలో శ్రీరంగనాథ స్వామివారి ఆలయాన్ని టీడీడీ సహకారంతో రూ.2.10 కోట్లతో పునర్నిర్మించనున్నారు. అన్నవరం దేవస్థానం నిధులు రూ.60 లక్షలతో నారసింహుని ఆలయంలో మెట్ల మార్గానికి ఆదివారం త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి శంకుస్థాపన చేయనున్నారు. కోరుకొండ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ భాగస్వామ్యంతో రూ.3.80 కోట్ల నిధులతో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి పథకాలకు సంబంధించిన పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సారథ్యంలో నిర్వహించనున్నారు.


శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువు దీరిన కోరుకొండ

ఐదేళ్లలో జరిగిన పనులివీ..

కోరుకొండ బస్టాండ్ సెంటర్ నుంచి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం వరకూ రథం రోడ్డును రూ.కోటితో నిర్మించారు. దీనివల్ల స్వామివారి కల్యాణోత్సవం, రథోత్సవాల సమయంలో ప్రమాదాలను నివారించారు. కొండ చుట్టూ తిరిగే గిరి ప్రదక్షిణ భక్తులకు వీలుగా రోడ్డును రూ.20 లక్షలతో అభివృద్ధి చేశారు. స్వామివారి తెప్పోత్సవం సందర్భంగా ఎలాంటి ఇబ్బంది రాకుండా నాణ్యమైన పంటును సమకూర్చారు.

సకాలంలో స్పందించేందుకు..

రాజానగరం నియోజకవర్గంలో వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉంది. అయితే అనుకోని ఘటనల్లో అగ్ని ప్రమాదాలు సంభవించి పంటలు కాలిపోయేవి. కుప్పలుగా వేసి ధాన్యం కాలిబూడిదయ్యేది. ప్రమాదాలను సకాలంలో నిలువరించేందుకు వీలుగా రూ.80 లక్షలతో కాపవరం ఎంపీడీఓ కార్యాలయ పరిసరాల్లో నిర్మించిన అగ్నిమాపక కేంద్రాన్ని కూడా ఆదివారం ప్రారంభించనున్నారు.

ఆ స్వామికి సేవకుడిలా..



శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి పురాతన చరిత్ర ఉంది. ఆ స్వామివారి కృపతోనే ఎమ్మెల్యేను అయ్యాను. నా తండ్రి జక్కంపూడి రామ్మోహన రావు స్ఫూర్తితో ప్రజా సేవ చేస్తున్నా. కోరుకొండలో రూ.9.40 కోట్లతో అభివృద్ధి పనులు చేశాను. ఆదివారం రూ.3.80 కోట్లతో మరిన్ని పనులకు శంకుస్థాపనలు చేస్తాం. దేవస్థానాన్ని మరింత ప్రగతి పథాన తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తా.
–జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

ఆలయ పునర్నిర్మాణం అద్భుత ఘట్టం



కోరుకొండలో రూ.2.10 కోట్లతో పురాతన శ్రీరంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణం చేపట్టనుండటం అద్భుత ఘట్టం. 1930 దశకంలో నిర్మించిన ఆలయంలో స్వామివారి విగ్రహం నిలుచుని ఉండడం ఇక్కడ ప్రత్యేకత. అలాగే లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో రాజగోపురం, మెట్ల నిర్మాణం తదితర పనులకు త్రిదండి చినజీయర్ స్వామి రావడం ఇక్కడి ప్రజల అదృష్టం. దీనికి సహకరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు.
–తాడి రజనీరెడ్డి, అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు

ఘనంగా బషీర్‌బీబీ ఉరుసు ఉత్సవాలు

కొత్తపల్లి: పొన్నాడలో బషీర్‌బీబీ (బంగారు పాపమ్మ) దర్గా వద్ద 69వ ఉరుసు ఉత్సవాలు రెండో రోజు శనివారం ఘనంగా జరిగాయి. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దర్గా ప్రాంగణం చుట్టుపక్కల ప్రాంతాలు భక్తులతో కళకళలాడాయి. ఉత్సవాలను పురస్కరించుకుని నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశాలను ఏర్పాటు చేశారు. స్థానిక ముజావర్లు షేక్ బషీర్, షేక్ ఇమామ్‌వలీ, షేక్ పీర్ మహమ్మద్, షేక్ నాధల్లి బాషా, షేక్ బడే సాహెబ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. దర్గాను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆదివారం నిర్వహించనున్న గంధోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ముజావర్లు తెలిపారు. కొత్తపల్లి ఎస్సై స్వామినాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. అన్ని వాహనాలు దర్గా ప్రాంగణంలోకి వెళ్లనివ్వకుండా పొన్నాడ, నాగులపల్లి వద్దే నిలిపివేస్తున్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో భక్తులకు కావాల్సిన తాగునీరు ఏర్పాటు చేసి, పారిశుద్ధ్యంపై దృష్టిసారించారు.


విద్యుత్తు కాంతుల నడుమ బషీర్‌బీబీ దర్గా


దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముజావర్లు